## క్లుప్తంగా

### లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



నెల్లూరు రూరల్: నరసింహకొండపై ఈ నెల 30 నుంచి జరుగనున్న వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఆహ్వానించారు. నగరంలోని నివాసంలో ఎంపీ దంపతులను ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు, పాలక మండలి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు.

### న్యాయవాదుల నిరసన



నెల్లూరు(లీగల్): న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. విజయవాడలో న్యాయవాది హరిరామ్‌పై దాడి చేయడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తూ నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి శుక్రవారం నిరసన తెలిపారు. నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి కార్యదర్శి అన్వర్‌బాషా, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు రంగారావు, నస్రీజాన్, చదలవాడ రాజేష్, దాసరి ప్రసాద్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా మున్సిపల్ పాఠశాల వార్షికోత్సవం



నెల్లూరు (టౌన్): కొండాయపాలెం దళితవాడలోని నగర పాలక ప్రాథమిక పాఠశాలలో వార్షిక వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పాఠశాల హెడ్‌మాస్టర్ భాస్కరరావు,ఉపాధ్యాయులు సంధ్యారాణి, మాధవి, వలంటీర్లు వినీత, రాణి పాల్గొన్నారు.

### సీఎండీను కలిసిన ఏపీఎంఎం నాయకులు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన కే సంతోషరావును తిరుపతిలోని ఆయన ఛాంబర్‌లో ముస్లిం మైనార్టీ విద్యుత్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్కే అల్తాఫ్, అధ్యక్షుడు బాషా, డిస్కం అధ్యక్షుడు నవాబ్‌జానీ, కార్యదర్శి రియాజ్, జిల్లా ప్రాంతీయకార్యదర్శి రఫీ, తదితరులు పాల్గొన్నారు.

### మెరుగైన వసతుల కల్పనకు కృషి

నెల్లూరు(మినీబైపాస్):దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని ఆ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కోఆర్డినేటర్ లక్ష్మీసునంద సూచించారు. శుక్రవారం ఆమె తన ఛాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. మరమ్మతులకు గురైన రక్త పరీక్షల మెషిన్‌ను బాగుచేయించాలని సూచించారు. వార్డుల్లో రోగులకు అవసరమైన చోట ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. ల్యాబ్‌ను అధునాతన మూడు అంతస్తుల భవనంలోకి మార్చాలని సూచించారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి కళారాణి, హెచ్‌డీఎస్ కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

### సీపీఎం ప్రజాభేరి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు అయ్యప్పగుడి సెంటర్‌లో శుక్రవారం ప్రజాభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేసేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. నాయకులు కిన్నెరకుమార్, ప్రసాద్, సంపత్‌కుమార్, కాలేషా, కృష్ణ ,తదితరులు పాల్గొన్నారు.

### మన్‌కీ బాత్‌లో భాగస్వాములు కావాలి

నెల్లూరు(మినీబైపాస్): ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాకు విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 2014 అక్టోబరు 3న విజయ దశమి నాడు ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఈ నెల 30న దూరదర్శన్‌లో ప్రసారం కానున్న ప్రధాని మోదీ మన్‌కీ బాత్ వంద ఎపిసోడ్‌ను వీక్షించి విజయవంతం చేయాలని కోరారు.

# మహిమాన్వితం..వేదగిరి క్షేత్రం

- రేపట్నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు
- ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు
- భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేకంగా సౌకర్యాల కల్పన

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై ఉన్న వేదగిరి క్షేత్రం మహిమాన్విత క్షేత్రంగా వెలుగొందుతోంది. ఈ క్షేత్రంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఆదివారం నుంచి వైభవంగా నిర్వహించనున్నారు. మే 10వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వేదగిరి క్షేత్రాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు.

**ఉత్సవాలు ఇలా**

ఈ నెల 30న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. మే 1న ధ్వజారోహణం, శేషవాహన సేవ, 2న చప్పరోత్సవం, హంస వాహనసేవ, 3న చప్పరోత్సవం, సింహ వాహనసేవ, 4న చప్పరోత్సవం, పూలంగిసేవ, హనుమంతసేవ, 5న మోహినీ ఉత్సవం, అఖండజ్యోతి, మూలవర్లకు పూలంగిసేవ, బంగారు గరుడసేవ, 6న పూలంగిసేవ, కల్యాణోత్సవం, గజ వాహనసేవ, 7న రథోత్సవం, 8న చప్పరోత్సవం, అశ్వవాహనసేవ, 9న ఏడు కోనేర్ల వద్ద తీర్థవాది, ధ్వజావరోహణం నిర్వహించనున్నారు. 10న పుష్పయాగం, ఏకాంతసేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

**భక్తులకు ప్రత్యేక వసతులు**

వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా నరసింహకొండపై అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భక్తులు సేదతీరేందుకు ఆలయ పరిసరాల్లో చలువ పందిర్లు వేశారు. ప్రత్యేక శోభతో విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. భక్తుల కోసం ప్రత్యేకంగా తాగునీరు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పటిష్ట పోలీసు బందోబస్తుతో పాటు అవుట్ పోస్టును ఏర్పాటు చేశారు. నగరంలోని ములుముడి బస్టాండు నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. నరసింహకొండ క్రింది భాగంలోని దేవరపాలెం నుంచి చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏడు కోనేర్ల వద్ద ప్రమాదాల నివారణకు ముందస్తుగా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. అగ్ని ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు. విద్యుత్ సరఫరా నిరంతరం ఉండేలా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు.



వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎదుట చలువ పందిళ్లు వేసిన దృశ్యం



ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ బోర్డులు

**బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు**



"వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడమే లక్ష్యంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పాలక మండలి సభ్యులతో పాటు దేవాదాయ శాఖ, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతాం.

– వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఆలయ చైర్మన్

## టీడీపీకి ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా?



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్

- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): 2024 ఎన్నికల్లో టీడీపీకి ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా అని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ ప్రశ్నించారు. నగరంలోని 50వ డివిజన్ సంతపేట ఆంజనేయస్వామి గుడివీధి, బొగ్గుల వీధి, అజాద్‌సెంటర్, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంతో భాగంగా గడపగడపకు వెళ్లి గత ప్రభుత్వం ఏమి చేసింది..నాలుగేళ్ల పాలనలో తమ ప్రభుత్వం ఏమి చేసిందో వివరిస్తూ ప్రజల మద్దతు కోరుతున్నామన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతంగా సాగుతోందన్నారు. ఇప్పటి వరకు కోటికి పైగా కుటుంబాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలిపాయన్నారు. ఎన్ని పార్టీలు ఏకమై వచ్చినా..ఎన్ని జిమ్మిక్కులు చేసినా వారు అలసిపోవాల్సిందేనన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మళ్లీ సీఎంగా గెలిపిస్తారన్నారు. 2019 ఎన్నికల సమయంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీని చంద్రబాబునాయుడు ఇష్టానుసారంగా విమర్శించారన్నారు. గత నాలుగు రోజులుగా ఆయన్ని ప్రశంసిస్తూ అందరం కలిసి ఎన్నికలకు వెళ్దామని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2024లో సీఎం వైఎస్ జగన్ వస్తేపోతుందని, మేమే అధికారంలోకి వస్తామని మాట్లాడుతున్న చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా అని ప్రశ్నించారు. ఎప్పుడు ఎవరితో పొత్తులు పెట్టుకుని ఎన్నికలకు వెళ్దామా అనే ఆలోచన తప్ప, జగన్‌మోహన్‌రెడ్డిని సింగిల్‌గా ఎదుర్కొనే ధైర్యం లేని చంద్రబాబు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. టీడీపీకి భవిష్యత్తేలేదని, భవిష్యత్తు ఉన్న నాయకుడు ఎలాంటి వాడో అందరికీ తెలుసన్నారు. పాదయాత్రలో ఏమి మాట్లాడుతున్నాడో కూడా అర్థం కాని పరిస్థితుల్లో నారా లోకేష్ ఉన్నారన్నారు. ఇలాంటి వారందరూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. కార్పొరేటర్ గుంజి జయలక్ష్మి, ఏపీ అగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదల సుధీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేస్తే జరిమానా

నెల్లూరు(బారకాసు): ఇంటింటి చెత్త సేకరణ చేపడుతున్నాం..ఇంటి వద్దకు శానిటేషన్ సిబ్బంది వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేస్తే జరిమానా విధిస్తామని కమిషనర్ వికాస్ మర్మత్ హెచ్చరించారు. పొదలకూరురోడ్డు, కేన్సర్ ఆస్పత్రి సమీపంలోని 34/1, 34/2 సచివాలయాల శానిటేషన్ మస్టర్ పాయింట్లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం బుజబుజనెల్లూరు, కొత్తూరు, పడారుపల్లి ప్రాంతాల్లో పర్యటించి శానిటేషన్‌ను పరిశీలించారు. శానిటేషన్ సిబ్బందికి సూచనలు చేశారు. ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి మంచినీరు సరఫరా అయ్యే జంక్షన్ సమీపంలో గుంతలమయంగా ఉన్న రోడ్డును చూసి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శానిటేషన్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

**గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి**

జగనన్న కాలనీ లేఅవుట్లలో చేపడుతున్న గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గృహ నిర్మాణాలపై శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. టిడ్కో గృహాల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన యాక్షన్ ప్లాన్‌ను సంబంధిత అధికారులు పటిష్టంగా అమలు చేస్తే లక్ష్యాలను సాధించవచ్చన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్, కార్పొరేషన్ ఇంజినీర్లు పాల్గొన్నారు.



బహిరంగ ప్రదేశంలో పడేసిన చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

### బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక రేపు

నెల్లూరు(బృందావనం): స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని డీఎస్సార్ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటలకు పంచమ రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు ఇనుకపల్లి కామేశ్వరప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో నిర్వహిస్తున్న ఉచిత వివాహ పరిచయ వేదికను బ్రాహ్మణ సంఘీయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 98484 86599, 79013 54004 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### విద్యార్థిని అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): కళాశాల విద్యార్థిని అదృశ్యంపై బాలాజీనగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు..శ్రామికనగర్‌లో కృష్ణమూర్తి కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కుమార్తె నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఈ నెల 27న రోజూలాగే కుమార్తెను తండ్రి కళాశాలలో వదిలిపెట్టారు. సాయంత్రం ఇంటికి తీసుకొచ్చేందుకు కళాశాల వద్దకెళ్లగా అప్పటికే వెళ్లిపోయిందని కళాశాల సిబ్బంది తెలిపారు. కుమార్తె కోసం చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో బాలాజీనగర్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

### మర్యాద పూర్వకంగా..



నెల్లూరు (వేదాయపాళెం): నగరంలోని కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావును అఖిల భారత యాదవ మహాసంఘం జిల్లా నేతలు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు విఠపు లలితారాంయాదవ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. యాదవ కార్పొరేషన్ ద్వారా యాదవుల అభివృద్ధికి సహకరిస్తున్న సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. సంఘ నేతలు వెంకయ్య, దినేష్, పవన్ కుమార్, నిరంజన్ యాదవ్, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా కేంద్రీయ విద్యాలయ వార్షికోత్సవం



నెల్లూరు రూరల్: కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో 8వ వార్షికోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎస్ఎస్ఏ ప్రాజెక్ట్ సమన్వయకర్త ఉషారాణి, సర్వశిక్ష అభ్యాస్ చైర్మన్ నామిని ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ప్రిన్సిపల్ సరితారావు, హెచ్ఎం వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయులు జోషిబాబు, అశోక్‌కుమార్, రవి, తదితరులు పాల్గొన్నారు.

### సన్మానం

నెల్లూరు(అర్బన్): స్టెప్‌అప్‌ఈవెంట్స్ అధినేత నేలకుర్తి రమణకుమార్ కళ,సేవా రంగాల్లో అందించిన విశిష్ట సేవలను గుర్తించి మలేషియాకు చెందిన సెయింట్ మదర్ థెరిస్సా వర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా నగరంలోని నోవా బ్లడ్ బ్యాంకులో రమణకుమార్ తన స్నేహితులతో కలిసి శుక్రవారం రక్తదానం చేశారు. అనంతరం రమణకుమార్‌ను పలువురు ఘనంగా సన్మానించారు. ప్రముఖ గుండె వైద్యుడు శ్రీనివాసరాజు, అమరావతి కృష్ణారెడ్డి, మోపూరు భాస్కర్‌నాయుడు, పాల్గొన్నారు.

## బడ్జెట్ సమానంగా కేటాయించేలా చర్యలు తీసుకోవాలి



మంత్రి సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని నగరపాలక సంస్థకు చెందిన 26 డివిజన్ల కార్పొరేటర్లందరికీ సమానంగా బడ్జెట్‌ను కేటాయించేలా తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కోరారు.శుక్రవారం కావలికి వచ్చిన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బడ్జెట్ నివేదికను ప్రవేశపెట్టారని తెలిపారు. అందులో పదిహేను అంశాలను కేవలం రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దతుదారులైన పది మంది కార్పొరేటర్లకు ఉపయోగపడేలా వర్కులను పొందుపరిచారని వివరించారు. బడ్జెట్ నివేదికను రద్దు చేసి కార్పొరేటర్ల అందరికీ సమానంగా నిధులు కేటాయించేలా కొత్తగా బడ్జెట్ తయారు చేయాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ ఆశీస్సులతో మేయర్ పదవీ చేపట్టిన పొట్లూరి స్రవంతి పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా కార్పొరేటర్లపై అన్యాయంగా కేసులు పెట్టిందని తెలిపారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కార్పొరేషన్ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేటర్లు ఎం గౌరి, బీ శ్రీనివాసయాదవ్, ఎం విజయభాస్కర్‌రెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాసులురెడ్డి, డీ రాజేష్, సుధాకర్, సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

### పీఎంపీల సేవలు భేష్



నెల్లూరు(మినీబైపాస్): గ్రామీణ ప్రాంతాల్లో అతి తక్కువ ఖర్చుతో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న పీఎంపీల సేవలు అభినందనీయమని డీఎంహెచ్ఓ పెంచలయ్య పేర్కొన్నారు. నగరంలో జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో 60 ఏళ్ల పీఎంపీ సావనీర్‌ను శుక్రవారం డీఎంహెచ్ఓ ఆవిష్కరించారు. ప్రభుత్వ వైద్యాధికారులు ప్రమోద్, సునీల్, పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా నాయకులు శేషయ్య, వీరయ్య, రామదాసు, దేవరకొండ శ్రీనివాసులు, రాఘవులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### సన్మానం



నెల్లూరు(అర్బన్): అనస్థీషియా ప్రొఫెసర్‌గా డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం సేవలు మరువలేనివని జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్దానాయక్ పేర్కొన్నారు. దర్గామిట్టలోని జీజీహెచ్‌లో ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం దంపతులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉండే ప్రత్యేక పెయిన్ రిలీఫ్ కేంద్రాన్ని జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఘనత డాక్టర్ బాలసుబ్రహ్మణ్యానికి దక్కుతుందన్నారు. ఆయన శేషజీవితం హాయిగా కొనసాగాలని కోరారు. అడ్మినిస్ట్రేటర్ కళారాణి, ఆర్ఎంఓ సుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## శివానందలహరిలో హరిహరతత్వం

నెల్లూరు(బృందావనం): హరిహరతత్వాన్ని భక్తితత్పరతతో శంకరభగవత్పాదుల వారు పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలోని పాలధార-పంచధార వద్ద శివానందలహరిలో ఉటంకించారని ప్రముఖ ఉపన్యాసకులు, బ్రహ్మశ్రీ దీవి హయగ్రీవాచార్యులు ప్రవచించారు. గాంధీబొమ్మ సమీపంలోని టీపీఎస్ కల్యాణసదన్‌లో పినాకినీ విద్యాపీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న 76వ జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంత్యుత్సవాల్లో నాల్గో రోజైన శుక్రవారం రాత్రి శివానందలహరిపై ఉపన్యసించారు. ఈ సందర్భంగా హయగ్రీవాచార్యులను పలువురు ప్రముఖులు మెట్టురామచంద్రప్రసాద్, ఎన్ బలరామయ్యనాయుడు, స్వయంపాకుల శ్రీనివాసులు, దేశిబొట్ల ఫణిరత్నం, జీ వాసుదేవరావు, ఐ.కామేశ్వరప్రసాద్ ఘనంగా సత్కరించారు.

## దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

నెల్లూరు(పొగతోట): దివ్యాంగుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ నాగరాజకుమారి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, ఎన్‌జీఓలతో నిర్వహించిన సమావేశంలో ఏడీ మాట్లాడారు. దివ్యాంగుల కోసం ఆర్‌పీడబ్ల్యూడీ యాక్ట్‌ను కేంద్ర ప్రభుత్వం 2016లో తీసుకొచ్చిందని తెలిపారు. ఈ యాక్ట్ అమలుకు జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇందులో జిల్లా అధికారులు, ఎన్జీఓలు, దివ్యాంగులు సభ్యులుగా ఉంటారన్నారు. ఈ కమిటీ క్రమం తప్పకుండా సమావేశమవుతూ దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతుందని తెలిపారు. దివ్యాంగుల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటుందన్నారు.



మాట్లాడుతున్న ఏడీ నాగరాజకుమారి

### నేడు,రేపు కళాంజలి వార్షిక వేడుకలు



నెల్లూరు(బృందావనం): పురమందిరంలో కళాంజలి సాంస్కృతిక సంస్థ 35వ వార్షిక వేడుకలను శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ గౌరవ సలహాదారుడు నలుబోలు బలరామయ్యనాయుడు, నిర్వాహకుడు దువ్వూరు బెనర్జి తెలిపారు.నగరంలోని అతిథి గ్రాండ్‌లో వార్షికోత్సవ ఆహ్వాన పత్రికలను కళాంజలి సంస్థ వ్యవస్థాపకుడు అనంత్, సభ్యుడు జి.శివకుమార్‌రెడ్డితో కలిసి శుక్రవారం వారు ఆవిష్కరించారు. శనివారం సాయంత్రం 6గంటలకు నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌కు 'కళాంజలి' పురస్కారం, డీ కొరియోగ్రాఫర్ చైతన్యమాస్టర్‌కు 'కళాంజలి నృత్య అవార్డు'ను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.ఆదివారం సాయంత్రం 6గంటలకు ప్రముఖ సినీనటుడు శుభలేఖ సుధాకర్, పాడుతా తీయగా శరత్‌చంద్రకు కళాంజలి అవార్డులు అందజేయనునన్నట్లు తెలిపారు.

### ఇంటర్ విద్యార్థులకు అభినందన

నెల్లూరు(బృందావనం): వనంతోపుసెంటర్‌లోని జనహిత వాత్సల్య ఆశ్రమానికి చెందిన విద్యార్థులు ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆశ్రమ ఆర్గనైజర్ జీవీ సాంబశివరావు శుక్రవారం అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకుడు చేజర్ల సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా జనహిత వాత్సల్యకు చెందిన విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో నలుగురు, ద్వితీయ సంవత్సరంలో ఏడుగురు అత్యధిక మార్కులు సాధించడం హర్షణీయమన్నారు. ఆడిటర్ ప్రకాష్‌రావు, హెచ్ఎం ఎం.మధుసూదన్‌రెడ్డి, విశ్రాంత అధ్యాపకుడు శ్రీరామచంద్రమూర్తి, మల్లికార్జున, గిరి పాల్గొన్నారు.



## మేయర్‌పై దాడి అవాస్తవం

నెల్లూరు(క్రైమ్): నగర మేయర్‌పై దాడి అవాస్తవమని, కేవలం ఓ పథకం ప్రకారమే ఆమె కార్పొరేటర్లపై తప్పుడు కేసులు పెట్టారని, వాస్తవాలను పరిశీలించి ఎస్పీ తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ గిరిజన విభాగం జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి కోరారు. ఈ మేరకు దళిత, గిరిజన సంఘాల నాయకులతో కలిసి ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి డైరెక్షన్‌లో మేయర్ పొట్లూరి స్రవంతి యాక్షన్ చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల జరిగిన కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తనపట్ల అనుచితంగా ప్రవర్తించారని మేయర్ పేర్కొనడం దారుణమన్నారు. నాటి సమావేశ వీడియోలు, సీసీ పుటేజీలను పరిశీలిస్తే మేయర్ పనిగట్టుకుని అసత్యఆరోపణలు చేస్తున్నట్లు అర్థమవుతుందన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని వాడుకోవడం సిగ్గుచేటన్నారు. దళిత,గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణ ప్రసాద్, గిరిజన సంఘాల జేఏసీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు కట్టా ఆశోక్, మేలింగి పాల్, బీసీ నాయకుడు బాలాజీ, దళిత, గిరిజన సంఘాల జేఏసీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గున్నం రాహుల్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న పాలకీర్తి రవి

## వాసవి మాత జ్యోతికి అఖండ స్వాగతం



నెల్లూరు(బృందావనం): వాసవి కన్యకాపరమేశ్వరి జన్మస్థలమైన పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ నుంచి చెన్నైకు వెళుతున్న వాసవి జ్యోతి శుక్రవారం రాత్రి నెల్లూరుకు చేరుకుంది. స్టోన్‌హౌస్‌పేటలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, ఆదిలక్ష్మికుమారి దంపతులు, ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో వాసవి జ్యోతికి అఖండ స్వాగతం పలికారు. అమ్మవారి జ్యోతికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి మాత జ్యోతి వెంట సాగుతున్న చెన్నై శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం చారిటీస్ నిర్వాహకులను ఘనంగా సత్కరించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సుంకు మనోహర్, కోశాధికారి పచ్చిసెట్టి శ్రీనివాసులు,చలువాది శరత్‌కుమార్, వొమ్మిన ఈశ్వర మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డైకస్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని వెస్ట్–1 సెక్షన్ ఏఈ లక్ష్మీబాయి శుక్రవారం తెలిపారు. మూలాపేట, ఫత్తేఖాన్‌పేట, రై తుబజారు, టెక్కేమిట్ట, చిన్నబజారు,పెద్దబజారు, పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

- ఎంజీనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్, నీలగిరి సంఘం విద్యుత్ ఫీడర్ పరిధిలో నూతన విద్యుత్ టవర్స్ ఏర్పాటు చేస్తున్నందున శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని ఏఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు. లక్ష్మీనరసింహపురం, రామాలయంవీధి, బారాషహీద్ దర్గా, ప్రగతినగర్, లేక్‌వ్యూకాలనీ, సుజాతమ్మకాలనీ, నెల్లూరురూరల్ తహసీల్దార్ కార్యాలయం, సరస్వతీనగర్, క్రాంతినగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని వివరించారు.
- రాజేంద్రనగర్ విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలో నూతనంగా విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నందున శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని వెస్ట్–2 ఏఈ గోపి శుక్రవారం తెలిపారు. పాతమున్సిపల్ కార్యాలయం, గుప్తాపార్కు, ములుమూడిబస్టాండ్, చిన్నబజారు, విఘ్నేశ్వరపురం, మన్సూర్‌నగర్, ఇరుకాళమ్మసంఘం, పరమేశ్వరినగర్, మహేరినగర్, కోటమిట్ట, శివగిరికాలనీ, శాంతినగర్, రాజావారివీధి, పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.